19నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్ట్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 23 వరకు 24వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ –2024ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎం. ప్రిస్టీలీ గైస్ తెలిపారు. హైస్కూల్ స్థాయి విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో ఖో, కబడ్డి, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, బాక్స్ క్రికెట్, త్రోబాల్, అండ్ మార్చ్‌పాస్ట్ పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 16లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు నారాయణగూడలోని వైఎంసీఏ సెంటర్‌లో లేదా, సెల్: 7799665544, 7032660614 లో సంప్రదించాలని సూచించారు.



ప్రతి జ్వరం డెంగీ కాదు

- 'విజృంభిస్తున్న వైరల్ ఫీవర్'
- రోగులతో నిండిపోతున్న ఆస్పత్రులు
- 'ముందు జాగ్రత్త ఉంటే జ్వరాల బారిన పడరంటున్న వైద్యులు
- 'వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం

కాచిగూడ: జంట సర్కిళ్ల పరిధిలో విజృంభిస్తున్న విషజ్వరాలు, పట్టని ప్రభుత్వ యంగ్రాంగం.. ఏ ఆస్పత్రిలో చూసినా కిటకిటే.. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్నాయి. సాధారణ క్లినిక్‌లకే రోజులో 50కి పైగా ఫీవర్ కేసులు వస్తున్నాంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇందుకు కారణం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం ఒక ఎత్తైతే విషజ్వరాల విషయంలో వ్యక్తిగత అవగాహన మరో ప్రధాన కారమంటున్నారు వైద్యులు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అవగాహన లోపంతోనే..

జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట, ముషీరాబాద్ జంట సర్కిళ్ల పరిధిలో గల్లీ అస్పత్రి మొదలుకొని కార్పొరేట్ ఆస్పత్రి వరకు ఎక్కడ చూసినా ఏదో ఒక జ్వరంతో బాధపడుతూ వస్తున్నవారే. అవగాహన లోపంతోనే.. సీజనల్ వ్యాధులు సహజంగానే మారుతున్న కాలానుగుణంగా వస్తూనే ఉంటాయి. వీటిని కనీస అవగాహనతో అధిగమిస్తే అవకాశాలు చాలా ఉన్నాయి. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత కూడా వ్యాధులు ప్రబలకుండా ప్రధాన పాత్ర పోషిస్తాయి. చాలా మంది జ్వ రం వస్తుందంటే దానికి మందులు వాడడానికే ప్రయత్నిస్తుంటారు తప్ప ఇతరత్రా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. ముఖ్యంగా వర్షపు, మురు గు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్న ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్నారు.

చిన్నపిల్లల పట్ల ఇలా చేయండి..

ఈ సీజనలో ముఖ్యంగా చిన్నారులే ఎక్కువగా వైరల్ ఫీవర్ బారిన పడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం పిల్లలకు వేసే స్లీవ్‌లెస్ షార్ట్స్, పొట్టిపొట్టి దుస్తులు వేయడమే కారణంగా చెప్పవచ్చు. సహజంగానే ఈ సీజన్‌లో దోమల వృద్ధి అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో పిల్లలు వేసుకునే స్లీవ్‌లెస్, పొట్టి డ్రెస్సుల వల్ల శరీరం మొత్తం కవర్ కాదు. దీంతో దోమలు ఎక్కువగా పిల్లలనే కుడుతుంటాయి. దీంతో ఆయా పిల్లల బాడీ ఇమ్యూనిటీని బట్టి వారు రకరకాల జ్వరాల బారిన పడుతున్నారు.

ప్లేట్‌లెస్ తగ్గినంత మాత్రాన డెంగీ కాదు..

చల్లని వాతావరణంలో పిల్లలను తిప్పడం, వాహనాలపై ముందు కూర్చుని ప్రయాణించడం వల్ల జలుబు, దగ్గు వంటి రుగ్మతలు పెరగడంతో పాటు నిమోనియా బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గినంత మాత్రాన డెంగీ కాదు.. జ్వరం ఇతరత్రా రుగ్మతలు వచ్చిన సందర్భంలో సహజంగానే ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గే అవకాశం ఉంది. అదే విధంగా వాడుతున్న యాంటీ బయాటిక్స్ వల్ల కూడా ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోతాయి. చాలా ఆస్పత్రులు స్వార్థ పూరిత ఆలోచనతో డెంగీ జ్వరంగా భయపెడుతూ వేలకు వేలు బిల్లుల రూపేణ గుంజుతున్నారు.

- చాలా వరకు డెంగీ కేసుల్లో పరిస్థితి తీవ్ర రూపం అయిన సందర్భంలో మరణ శాతం అయితే వందకు 5,6 మాత్రమే ఉంటారు. అయితే సాధారణ, వైరల్ ఫీవర్లను కూడా డెంగీ ఫీవర్‌గా నిర్ధారిస్తున్న కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు మోసాలకు పాల్పడుతున్నారు. డెంగీ వ్యాధి రోగులు డాక్టర్ల సూచనలతో ఆహారపు అలవాట్ల మార్పుతో వ్యాధిని చాలా వరకు తగ్గించుకోవచ్చు.

జంట సర్కిళ్లలో పరిస్థితి దారుణం..

వైరల్ ఫీవర్ విషయంలో అంబర్‌పేట, ముషీరాబాద్ జంట సర్కిళ్ల పరిధి ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా మురుగు, చెత్తాచెదారం కనిపిస్తోంది. విష జ్వరాలు ప్రబలుతున్నప్పటికిఖు ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న జాగ్రత్తలు ఎక్కడ కనిపించడం లేదు. ఎంటమాలజీ అసలు ఉందా లేదా అనేది ఇక్కడ అనుమానం. అంతే కాకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో స్థానిక అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు.

అవగాహనే మందు..



తల్లిదండ్రులు వైరల్ ఫీవర్ల పట్ల కనీస అవగాహన ఉంటే పిల్లలు జ్వరాల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఒక వేళ జ్వరం వచ్చినప్పటికి వారికున్న అవగాహనే వారికి మందుగా పనిచేస్తుంది. పిల్లలు జ్వరాల బారిన పడినప్పుడు వారిని స్కూళ్లకు పంపకుండా ఇంటి వద్దనే ఉంచాలి. పిల్లలకు పొట్టిపొట్టి డ్రెస్‌లు వేయకుండా శరీరం మొత్తం కవరయ్యే విధంగా దుస్తులు ధరింపజేసి మస్కిటో రిప్లెన్స్ క్రీములను రక్షణగా వాడుకోవాలి. ఇక్కడ పిల్లలకు వచ్చే ప్రతి జ్వరం డెంగీ జ్వరం కాదని తెలుసుకోవాలి. – డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, కాచిగూడ

కళలకు పుట్టినిల్లు తెలంగాణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కలలకు పుట్టినిళ్లు తెలంగాణ అని తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు.గురువారం జాతీయ వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు ఎల్.వి.చెన్నారావు ఆధ్వర్యంలో మామిడి హరికృష్ణను కలిసి ఆషాఢమాసం బోనాల్లో కళాకారులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆషాఢమాసం బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుపుకోబోతున్నారని ఎందరో మంది కళాకారులకు ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వాయిద్య కళాకారుల సంఘం నాయకులు భరత్, శ్రీనివాస్, నాగేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి



టీజీపీఎస్సీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

హిమాయత్‌నగర్: గ్రూప్ పోటీ పరీక్ష అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని యువజన, విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్లకు తక్కువ గడువు ఉన్నందున వాటిని పొడిగించాలన్నారు. ఉద్యోగ కేలండర్‌ను విడుదల చేయాలని, డీఎస్సీని కనీసం 45 రోజుల వరకు పొడిగించాలని కోరారు. నాయకులు కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్, కె.ఎస్. ప్రదీప్, మూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

చిక్కడపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరుద్యోగ చైతన్య యాత్ర సమన్వయకర్త మఠం శివానంద స్వామి అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంధాలయం ప్రాంగణంలో గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల సంఖ్యను పెంచాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–2పరీక్షను డిసెంబర్‌లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యుగేందర్, సలీం, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయినవారికి న్యాయం చేస్తాం



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ శ్రీ స్వామివివేకానంద బస్తీలో గత జనవరి 29న అక్రమంగా ఇళ్లు కూల్చివేసి 19 నిరుపేద దళిత కుటుంబాలను అప్పటి ప్రభుత్వం రోడ్డు పాలు చేసిందని వెంటనే వారికి పునరావాసం కల్పించి ఆదుకోవాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలోని బస్తీ వాసులతో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో చర్చించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీవాసులు ఎంబి కృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్‌లో హరితహారం

ముషీరాబాద్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం అడిక్‌మెట్‌లో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కడప సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, అనురాధ, రవియాదవ్, హరీష్, ఖలీల్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

మరో భూ పోరాటానికి సిద్ధం కావాలి



చిక్కడపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలనను వ్యతిరేకించి ప్రాణాలను ఫణంగా పెట్టిన యోధుడు కొమురయ్య అని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కొమురయ్య స్ఫూర్తితో మరో భూపోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నేతలు జంగారెడ్డి, హరిబండి ప్రసాద రావు, శోభన్, రాహుల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ట్రస్మా ప్రతినిధులు

అంబర్‌పేట: రాష్ట్రంలో ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం ట్రస్మా అధ్యక్షులు సాదుల మధుసూదన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గుర్తింపు లేని పాఠశాలల్లో ప్రాథమిక విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లలేక నష్టపోతున్నారన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్(పెన్)ను కేటాయిస్తుందని, అది గుర్తింపు లేని పాఠశాలు విద్యార్థికి జారీ చేయలేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు బడ్జెట్ పాఠశాలలు, కార్పొరేటర్ పాఠశాలలను ఒకేలా చూడవద్దని వారు డైరెక్టర్‌ను కోరారు. తమ బడ్జెట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతకుముందు విద్యాశాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు ఎస్.రమేష్‌రావు, పి.రాఘువేంద్రారెడ్డి, పల్లె వినయ్‌కుమార్, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, బొల్ల శ్రీకాంత్, అల్తాప్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో ఆటో డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బాగ్‌లింగంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న ఆటో డ్రైవర్లపై స్పెషల్ డ్రైవ్ పేరుతో వేధింపులను తక్షణమే ఆపాలని, ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలను వారి అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు జీవన భృతిగా రూ.4500 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లక్ష్మణ్, వి.ఎల్.మోహన్, కె.రమేష్, మల్లేష్, కిరణ్, ఆంజనేయులు, యాదయ్య పాల్గొన్నారు.

రోశయ్యకు భారత రత్న ఇవ్వాలి



రోశయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ నీలా శ్రీధర్, రాజశేఖర్

కాచిగూడ: విలువలతో కూడిన నాయకుడిగా నిలిచిన దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకు భారతరత్న ఇవ్వాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసవి ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా గురువారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రోశయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య సేవలను కొనియాడుతూ పలువురు నేతలు ప్రసంగించారు. రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా, తమిళనాడు గవర్నర్‌గా ఎనలేని సేవలందించారన్నారు. ఆయన సేవలను గుర్తించి భారత రత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ గుప్తా, కొండ్లె మల్లికార్జున్, కొంపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య అందరివాడు.

ముషీరాబాద్: దివంగత ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య అందరివాడని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గురువారం రోశయ్య జయం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రోశయ్య ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. నెహ్రూ కాలం నుంచి రాహుల్‌గాంధీ వరకు రాజకీయాల్లో కొనసాగుతూ అందరివాడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. 14 సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో గంజి రాజమౌళి గుప్తా, ఆర్యవైశ్య కోశాధికారి ప్రభాకర్, నాయకులు సత్తయ్య, రాజశేఖర్‌గుప్తా, కృష్ణమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 49వ అఖిల భారత నృత్య సంగీత పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. గురువారం చిక్కడపల్లిలో సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఖజానా లెక్కల ఉపసంచాలకులు జి.వసుంధరతో కలిసి మాట్లాడుతూ 66 ఏళ్లుగా నవ్యనాటక సమితి సాంస్కృతిక రంగానికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమితి సమన్వయకర్త నిష్ఠల సుధామాల మాట్లాడుతూ కర్ణాటక సంగీతం(గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం), హిందుస్థానీ సంగీతం(గాత్రం, సితార్, తబలా), కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కథక్ రీతులలో సీనియర్, జూనియర్, విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు ఆగష్టు 14లోగా తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. వివరాల కోసం 9008625949 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మొక్కలు నాటిన కార్పొరేటర్



మొక్కలు నాటుతున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గురువారం కాచిగూడలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ మొక్కలు నాటారు. 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరిట తల్లుల గౌరవార్థం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, ఆర్.సంతోష్, బాబన్న, లావణ్య, తారా, సురేష్, ఎస్.రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

7న మున్నూరుకాపు మహిళలకు వంటల పోటీలు

కాచిగూడ: మున్నూరుకాపు మహిళలకు ఈ నెల 7న కాచిగూడ లోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్య హాల్‌లో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు సహకారంతో వంటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు, మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు చామకూర సుజాత తెలిపారు. గురువారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా మహిళలు వ్యాపారం చేసుకోవడానికి అవసరమైన స్టాల్స్ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వంటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 9701328919 లో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు, చామకూర సుజాత

10వ తరగతి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలి



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, తదితర ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ల్యాప్‌టాప్స్ ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సగానికి పైగా విద్యార్థులకు సీట్లు దొరకడం లేదని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, పాఠశాలల్లో టీచర్లు, సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ విద్యను మరింత మెరుగు పర్చేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు బలరామ్, మణికంఠ, వంశీ, యువరాజ్, ప్రవీణ్, ధరం, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాముకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు గౌతమ్‌రావు

అంబర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారి రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇవ్వాలన్నారు. నవ వధువుకు తులం బంగారం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ విద్యార్థినికి స్కూటీ ఇవ్వాలని కోరారు. బీజేపీ కార్పొరేటర్‌లు కన్నె ఉమా రమేశ్ యాదవ్, అమృత, నాయకురాళ్లు జ్యోతి, సమత, నాయకులు ఆనంద్‌గౌడ్, కృష్ణగౌడ్, శ్యాంరాజ్, భూషణ్‌చారి, రమేశ్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

దశలవారీగా చెత్త డంపింగ్ కేంద్రాల తొలగింపు

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో దశలవారీగా చెత్త డంపింగ్ కేంద్రాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీ, ప్రాంతంలో ఉన్న చెత్త డంపింగ్ కేంద్రాన్ని తొలగించి ఇకపై అక్కడ చెత్త వేయరాదంటూ అక్కడే కూర్చొని స్థానికులకు అవగాహన కల్పించారు. స్థానికులతో కలిసి క్యారంబోర్డు ఆడారు. ఇంటికి వచ్చే చెత్త ఆటోలకు చెత్త ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, ఎస్ఎఫ్ఏలు ఆదిల్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



చెత్త డంపింగ్ ప్రాంతంలో క్యారంబోర్డు ఆడుతున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

అంబర్‌పేట: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం డీడీ కాలనీలోని పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన కేబినెట్ ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేబినెట్‌కు ఎంపికైన విద్యార్థుల విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాతో పాటు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండేలా పాఠశాలలో చొరవ తీసుకుంటామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ రూపరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

- తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునికీకరణకు చర్యలు
- అధికారులకు ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశం

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణకు యుద్ధప్రాతిపథికన చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ప్రజలు కూడా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్ మోతీలాల్ నెహ్రూ నగర్‌లో రూ.6.5లక్షలతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణంతో మోతీలాల్ నెహ్రూనగర్‌లో గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య, కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారమవుతుందన్నారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణ తర్వాతే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో శంకుస్థాపనలు జరిగి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా, బీజేపీ రాష్ట్ర నాయకులు టి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, సి. మల్లారెడ్డి, కవాడిగూడ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డి సాయికృష్ణ, బీజేపీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంసి మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్, కేశవరాజు, బీఆర్ఎస్ నేతలు రాంచందర్, రాజేష్, వల్లాల రవియాదవ్ మధు, శ్రీకాంత్, మాధవి, రూప, మంజుల, జలమండలి డీజీఎం కార్తికొరెడ్డి, మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో భూములను రక్షించుకుందాం



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీఎస్‌కే ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాధ స్ఫూర్తితో ప్రభుత్వ భూములను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ భూములు లేని ప్రజలు పట్టణాలకు వలస వచ్చి అడ్డకూలీలుగా, ఆటో కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. అసంఘటిత రంగంలో శ్రమ దోపిడీకి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూమి అనేది ఆత్మగౌరవంతో కూడిందని పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, వనం సుధాకర్, పర్వతాలు, గాదగోని రవి, నూనె వెంకటస్వామి, కుంభం సుకన్య పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సభను గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిపీఎస్‌కే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్‌పీకే కార్యదర్శి ఎస్.వినాయక్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ పెత్తందారుల ఆధిపత్యంపై పోరాటం చేసిన వీరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘుపాల్, టిపిఎస్‌కే అధ్యక్షులు భూపతివెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.